

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL    ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి    ఆదివారం 19-10-2025    సంపుటి : 07    సంచిక : 160    పేజీలు : 8    వెల : రూ 3-00


## ఉద్యోగ సంఘాలతో సర్కార్ కీలక చర్చలు



అమరావతి, అక్టోబర్ 18: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఉద్యోగ సంఘాలతో మంత్రి వర్గ ఉపసంఘం ఈరోజు (శనివారం) సమావేశమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రుల స్థాయిలో తొలిసారి సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్.. ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపనున్నారు. ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు, ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ దీపావళికి ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త సర్కారు నుంచి ఆశిస్తున్నామని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపటాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. నాలుగు డీఏలు చెల్లించాలని కోరతామని.. అవి ఈరోజు కాకపోయినా దశల వారీగా అయినా చెల్లించాల్సిందే అని స్పష్టం చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇచ్చే హెల్త్ కార్డులు ఆసుపత్రుల్లో సక్రమ అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై నేటి భేటీలో ఓ రూట్ మ్యాప్ వస్తుందని ఆశిస్తున్నామని ఉద్యోగ సంఘాల నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.


## డోస్ పెంచిన ట్రంప్.. 9వ యుద్ధాన్ని ఆపడానికి రెడీ..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డోస్ పెంచారు. దేశాల మధ్య యుద్ధాలు ఆపటంలో తనకు తానే సాటి అని నొక్కి వక్కాణిస్తున్నారు. యుద్ధాలు ఆపటం అంటే తనకు మహా ఇష్టం అని అంటున్నారు. పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్ దేశాల మధ్య యుద్ధం ఆపటం తనకు చాలా సులభమని చెబుతున్నారు. శుక్రవారం వైట్



హౌస్‌లో జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. 'నేను ఇప్పటి వరకు ఎనిమిది యుద్ధాలను ఆపాను. పాకిస్తాన్ – అఫ్ఘనిస్తాన్ దేశాల మధ్య యుద్ధాన్ని ఆపాలని నేను అనుకుంటే అది నాకు చాలా సులభం. ఓ వైపు నాకు దేశాన్ని నడపాల్సిన బాధ్యత ఉంది. కానీ, నాకు యుద్ధాలు ఆపటం అంటే భలే ఇష్టం. రువాండా, కాంగో యుద్ధం కావచ్చు.. ఇండియా, పాకిస్తాన్ యుద్ధం కావచ్చు. నేను యుద్ధాన్ని ఆపిన ప్రతీ సారి 'మీరు ఇంకో యుద్ధాన్ని ఆపారంటే నోబెల్ బహుమతి వస్తుంది' అని అంటూ ఉన్నారు. కానీ, నాకు మాత్రం నోబెల్ రావటం లేదు. నేను మనుషుల ప్రాణాలు కాపాడటం కోసం యుద్ధాలు ఆపుతున్నాను. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం మాత్రం తొమ్మిదవది అవుతుంది. యుద్ధం ఆపిన అధ్యక్షుడు ఇప్పటి వరకు ఎవ్వరూ లేరు. జార్జ్ బుష్ ఓ యుద్ధం చేశారు. కానీ, నేను మిలియన్ల మంది జనాల ప్రాణాలు కాపాడాను' అని అన్నారు. ఇండియా, పాకిస్తాన్ యుద్ధం గురించి కేవలం వైట్‌హౌస్‌లో మాత్రమే కాదు.. ఎక్కడికెళ్లినా తప్పకుండా చెబుతున్నారు. ఇండియా మాత్రం ట్రంప్ వ్యాఖ్యల్ని మొదటి నుంచి ఖండిస్తూనే వస్తోంది. ట్రంప్ కారణంగా యుద్ధం ఆపలేదని చెబుతోంది.

## ఆస్ట్రేలియా పర్యటనకు మంత్రి లోకేష్.. ఎన్ని రోజులంటే



అమరావతి, అక్టోబర్ 18: ఏపీ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. ఈనెల 19 నుంచి 24 వరకు అంటే ఆరు రోజుల పాటు ఆస్ట్రేలియాలో లోకేష్ పర్యటిస్తారు. ఈ మేరకు మంత్రి ఆస్ట్రేలియా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఇందులో భాగంగా ఆస్ట్రేలియా వర్సిటీల్లో అధునాతన బోధనా పద్ధతులపై అధ్యయనం చేయనున్నారు మంత్రి. సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ విజయవంతంపై రోడ్ షోలకు మంత్రి లోకేష్ హాజరుకానున్నారు. కాగా.. ఏపీకి భారీ పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా మంత్రి లోకేష్ ఇప్పటికే వివిధ దేశాల్లో పర్యటించిన విషయం తెలిసిందే. ఆయా పర్యటనలు విజయవంతం అయ్యి అనేక కీలక పెట్టుబడులను రాష్ట్రానికి తీసువచ్చారు కూడా. ఇప్పుడు తాజాగా ఆస్ట్రేలియాలో మంత్రి లోకేష్ పర్యటించనున్నారు. రేపటి (ఆదివారం) నుంచే ఈ పర్యటన కొనసాగనుంది. ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలని లోకేష్‌కు ఢిల్లీలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ప్రత్యేక ఆహ్వాన లేఖను పంపిన విషయం తెలిసిందే. మానవ వనరులు, సాంకేతిక, ఆర్థికాభివృద్ధి రంగాల్లో మంత్రి లోకేష్ నాయకత్వాన్ని ప్రశంసించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం ఈ మేరకు ఎస్‌వీపీలో భాగస్వామ్యం కావాలని ఆహ్వాన లేఖలో పేర్కొంది. ఈ క్రమంలో రేపటి నుంచి ఈనెల 24 వరకు ఆస్ట్రేలియాలో మంత్రి లోకేష్ పర్యటించనున్నారు. మరోవైపు విశాఖ వేదికగా వచ్చే నెల (నవంబర్) 14, 15 తేదీల్లో సీఐఐ సదస్సు జరుగనుంది. ఈ సదస్సులో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సిడ్నీ, మెల్‌బోర్న్‌లలో మంత్రి లోకేష్ రోడ్ షోలను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

## పర్యావరణానికి హాని కలిగించే వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి :జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి

కర్నూలు, అక్టోబర్ 18 పర్యావరణానికి హాని కలిగించే వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి పేర్కొన్నారు. శని వారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరం లోని ఏ క్యాంప్ మున్సిపల్ పార్క్ లో జిల్లా కలెక్టర్ మొక్కను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ వాయు కాలుష్యం వల్ల మానవ ఆరోగ్యం తో పాటు పర్యావరణంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందన్నారు.. అందువల్లే రాష్ట్ర ప్రభుత్వం "క్లీన్ ఎయిర్" (స్వచ్ఛమైన గాలి) అన్న థీమ్ తో ఈ వారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలని కలెక్టర్ పిలుపు ఇచ్చారు. పరిశ్రమల నుండి వెలువడే వాయువులు, వాహనాల నుండి వెలువడే పొగలు, వ్యర్థాలను కాల్చడం వంటి ప్రక్రియల ద్వారా వాయు కాలుష్యం ఏర్పడుతుందని, వీటిని తగ్గించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. దగ్గరి ప్రదేశాలకు వెళ్ళడానికి కాలి నడక, సైక్లింగ్ ను అలవాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, ఇంచార్జ్ ఎస్ ఈ శేష సాయి తదితరులు పాల్గొన్నారు



## జీఎస్టీ సంస్కరణలతో దేశంలో కొనుగోళ్ల జోరు

### అనుకున్న దాన్ని మించి ప్రజలకు మేలు
### మీడియాతో ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్



న్యూఢిల్లీ, అక్టోబర్18: ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త జీఎస్టీ సంస్కరణల వల్ల దేశంలో కొనుగోళ్లు పెరుగుతున్నాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాము అనుకున్న దానికన్న ఎక్కువగానే ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. దసరా సమయంలో ప్రజలు రికార్డు స్థాయిలో చేసిన కొనుగోళ్ల ద్వారా సంస్కరణల ప్రభావం కనిపిస్తోందని చెప్పారు. జీఎస్టీ 2.0పై కేంద్రమంత్రులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. సెప్టెంబర్ 22న తీసుకువచ్చిన సంస్కరణల వల్ల వినియోగదారుల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువ పన్ను తగ్గింపులు చేపట్టామన్నారు. అందువల్లే వినియోగదారులు ఆశించిన దానికంటే ఎక్కువ ప్రయోజనాలను పొందుతున్నారన్నారు. జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్ (ఖతాబీబర ఉనాజీ), అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలతో దేశమంతా పండగ వాతావరణం నెలకొందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంస్కరణలు దేశ ప్రజలకు ప్రధాని మోదీ ఇచ్చిన దీపావళి కానుక అని పీయూష్ గోయల్ అన్నారు. జీఎస్టీ డబుల్ ధమాకాతో మోదీ దేశప్రజల ఇంటికి లక్ష్మీదేవిని తీసుకువచ్చారన్నారు. జీఎస్టీ సంస్కరణలు అన్ని రంగాల్లో ఉత్సాహాన్ని తీసుకువచ్చాయని.. వీటితో దేశంలోని అన్ని రంగాలు లాభపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణ సమయంలో దేశంలో వినియోగం, డిమాండ్ ఎలా పెరుగుతుందనే దాని గురించి అనేక అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలో వినియోగం పెరుగుతోందని.. ఈ ఏడాది దాదాపు రూ.20 లక్షల కోట్ల అదనపు వినియోగం జరిగే అవకాశం ఉందని అన్నారు. అమెరికాకు స్మార్ట్‌ఫోన్‌లను ఎగుమతి చేయడంలో భారత్ తన పొరుగు దేశాన్ని అధిగమించిందని చైనాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇది దేశం సాధించిన అతిపెద్ద విజయమన్నారు. స్మార్ట్‌ఫోన్లు తయారు చేసే పలు అతిపెద్ద కంపెనీలు వాటి తయారీలో దాదాపు 20శాతాన్ని భారత్‌లోనే చేపడుతున్నాయని పేర్కొన్నారు.




# సంపాదకీయం

ఆదివారం 19-10-2025

## వెండితెర వెలుగులే బెటర్.

సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టడం మన దేశంలో కొత్త కాదు. ఎన్టీఆర్, ఎంజీఆర్, జయలలిత వంటి దిగ్గజాలు వెండితెరపై తమ ఇమేజ్‌ను రాజకీయ విజయాలుగా మలచుకున్నారు. అయితే, ఈ గ్లామరస్ ప్రయాణంలో విజయ శిఖరాలను చేరుకున్నవారు కొందరైతే, క్షేత్రస్థాయి రాజకీయాల కష్టాలు, ఆర్థికపరమైన ఇబ్బందులతో నిరాశకు గురైనవారు ఎంతో మంది ఉన్నారు. రాజకీయాల వల్ల నష్టం తప్ప లాభం లేదని భావించేవారు ఈ మధ్య పెరుగుతున్నారు. తాజాగా కేరళకు చెందిన బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ .., బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు ఈ వాస్తవాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాయి.కేరళ నుంచి బీజేపీ తరఫున గెలిచి కేంద్ర మంత్రివర్గంలో స్థానం పొందిన సురేశ్ గోపీ, రాజకీయాల్లో లాభం కంటే నష్టమే ఎక్కువని బహిరంగంగా ప్రకటించడం సంచలనం సృష్టించింది. సినిమాలు చేసుకుంటే మంచి ఆదాయం ఉండేదని, కానీ రాజకీయాల్లోకి వచ్చాక ఆదాయం తగ్గిపోయిందని, అవసరాలు తీరడం లేదని ఆయన వాపోయారు. మంత్రి పదవిని వదిలేసి మళ్లీ సినిమాల్లోకి వెళ్లాలని యోచిస్తున్నట్లు చెప్పడం, రాజకీయ జీవితంపై ఆయనకున్న అసంతృప్తిని తెలియజేస్తుంది.దీనికి కొనసాగింపుగా, హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన కంగనా రనౌత్ కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సినీ రంగాన్ని, రాజకీయ రంగాన్ని పోల్చుతూ.. రాజకీయం చాలా కష్టమని, పైగా ఇందులో ఆదాయం తక్కువ, ఖర్చులు ఎక్కువని నిట్టూర్చారు. ఒక నిజాయితీపరుడైన ఎంపీకి వచ్చే జీతం తమ నియోజకవర్గాల్లో పర్యటనలు, పీఏల జీతాలు, ఇతర అవసరాలకు సరిపోవడం లేదని, లక్షల్లో ఖర్చవుతోందని ఆమె వివరించారు. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే నిజాయితీగా ప్రజా సేవ చేసేందుకు ఎవరూ ముందుకు రారని కంగనా ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ స్థాయి సమస్యలను కూడా తమ వద్దకు ప్రజలు తీసుకొస్తున్నారని, వాటిని సొంత డబ్బుతో పరిష్కరించమని అడుగుతున్నారని ఆమె అసహనం వ్యక్తం చేశారు.సినిమా రంగంలో నటులు భారీ పారితోషికాలు అందుకుంటారు. వారికి ఉండే ప్రజాదరణ, స్టార్‌డమ్ తక్కువ కాలంలోనే కోట్లలో ఆదాయాన్ని ఆర్జించి పెడుతుంది. అదే సమయంలో, రాజకీయాలు ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ప్రజల కోసం పనిచేసే ప్రజాప్రతినిధులకు ఆదాయం కంటే ఖర్చులే అధికం. సినిమా స్టార్‌గా ఒక్క సినిమాకు కోట్లు తీసుకునేవారు, రాజకీయాల్లోకి వచ్చాక జీతం, అలవెన్సులు మాత్రమే ప్రధాన ఆదాయ వనరుగా ఉంటాయి. ఇది వారి మునుపటి ఆదాయంతో పోలిస్తే చాలా తక్కువ. ప్రజాప్రతినిధి అయిన తర్వాత నియోజకవర్గంలో పర్యటనలు, కార్యకర్తలను, ప్రజలను కలుసుకోవడం, వారి సమస్యలను పరిష్కరించడానికి అయ్యే ఖర్చులు ఊహించిన దానికంటే ఎక్కువగా ఉంటాయి. నటులకు తెరపై ఉండే గ్లామర్, రాజకీయాల్లో కనిపించదు. ఇక్కడ నిజమైన ప్రజాసేవ, క్షేత్రస్థాయి కష్టాలు, రాజకీయ ఒత్తిళ్లు ఉంటాయి. సినిమాలు, రాజకీయాలు రెండూ సమయాన్ని, శక్తిని డిమాండ్ చేస్తాయి. సినిమా పారితోషికం కోసం కొంత సమయం కేటాయించి, రాజకీయాలకు పూర్తి న్యాయం చేయలేకపోవడం, లేదా పూర్తిగా సినిమాలను వదులుకోలేకపోవడం వంటి సందిగ్ధత కూడా వారిలో ఆందోళన కలిగిస్తుంది.సురేశ్ గోపీ, కంగనా రనౌత్ వంటి ప్రముఖ నటుల వ్యాఖ్యలు? వెండితెర వెలుగులు, రాజకీయాల క్లిష్టత మధ్య ఉన్న ఆర్థిక, వాస్తవ వ్యత్యాసాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. గోపి కేరళ నుండి కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు, బిజెపి అనుభవజ్ఞుడైన సి సదానందన్ మాస్టర్‌ను కేంద్ర మంత్రివర్గంలో తన స్థానంలో నియమించాలని సిఫార్సు చేశారు. మాస్టర్ రాజకీయ సహకారాలను ఆయన హైలైట్ చేస్తూ “నన్ను తొలగించిన తర్వాత సదానందన్ మాస్టర్‌ను కేంద్ర మంత్రిగా చేయాలని నేను నిజాయితీగా చెబుతున్నాను. ఇది కేరళ రాజకీయ చరిత్రలో ఒక కొత్త అధ్యాయంగా మారుతుందని నేను నమ్ముతున్నాను” అని అన్నారు. 1994లో సిపిఐ(ఎం) కార్యకర్తలు చేసిన దాడిలో రెండు కాళ్లను కోల్పోయిన రాజకీయ హింస నుండి బయటపడిన మాస్టర్, ఉత్తర కన్నూర్ రాజకీయాల్లో మంచి పేరు సంపాదించారు.మలయాళ సినిమా రంగంలో అత్యంత ప్రజాదరణ పొందిన నటులలో ఒకరైన సురేష్ గోపి 2016 అక్టోబర్‌లో బిజెపిలో చేరారు. 2024లో త్రిసూర్ నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుండి, గోపి తన సినీ కెరీర్‌ను చాలావరకు నిలిపివేశారు, కానీ తన రాజకీయ బాధ్యతలను నిర్వర్తిస్తూనే నటనకు తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు అనేకసార్లు వ్యక్తం చేశారుప్రజా జీవితంలో నిజాయితీగా, నిస్వార్థంగా పనిచేయాలంటే, ఆదాయం కంటే ఖర్చులే అధికంగా ఉండే ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో, తగినంత జీతం, అలవెన్సులు లేకపోవడం వల్ల నిస్వార్థ ప్రజాసేవకు అడ్డుగోడగా మారుతుందని ఈ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. సినిమా రంగం నుంచి వచ్చిన సెలబ్రిటీలకు ఇప్పుడిప్పుడే రాజకీయాల్లోని ఈ ఖర్చుల తత్వం బోధపడుతున్నట్టు కనిపిస్తోంది. ఇది కేవలం వ్యక్తిగత ఆవేదన మాత్రమే కాదు, భారత రాజకీయాల్లో నిజాయితీగా పనిచేయాలనుకునే ప్రతి ప్రజాప్రతినిధి ఎదుర్కొనే సవాలుకు అద్దం పడుతోంది.

## పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్యకు కేటీఆర్ భరోసా..

హైదరాబాద్ : పద్మశ్రీ అవార్డు గ్రహీత, తెలంగాణ జానపద సాహితీ ముద్దుబిడ్డ అయిన దర్శనం మొగులయ్యకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మొగులయ్య ఈరోజు కేటీఆర్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.మొగులయ్య ఆరోగ్యం, యోగక్షేమాల గురించి కేటీఆర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా మొగులయ్య తన కంటిచూపు మందగించిందని, చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కేటీఆర్, మొగులయ్యకు హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌లో పూర్తి చికిత్సను అందించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.అనంతరం మొగులయ్య, గత ప్రభుత్వం తనకు హయత్ నగర్ మండలంలో కేటాయించిన 600 గజాల స్థలం విషయంలో కొంతమంది వ్యక్తుల నుండి ఎదురవుతున్న ఇబ్బందులు, కోర్టు కేసుల వివరాలను కేటీఆర్‌కు వివరించారు. దీనిపై తక్షణమే స్పందించిన కేటీఆర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. మొగులయ్యకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన భూమి విషయంలో కొందరు వ్యక్తులు కోర్టుల్లో కేసులు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి, మొగులయ్యకు న్యాయం చేయాలని కోరారు. అలాగే, మొగులయ్య ఆ స్థలంలో కట్టుకున్న గదిని కూడా కొంతమంది కూల్చివేసిన పరిస్థితి ఉందని మొగులయ్య చెప్పారని పేర్కొన్నారు. మొగులయ్య భూమికి, ఆయన కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు కేటీఆర్ సూచించారు. అవసరమైతే, మొగులయ్యకు ఎదురవుతున్న న్యాయపరమైన కేసులను ఎదుర్కొనేందుకు కూడా సహాయం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మొగులయ్య కేటీఆర్‌తో మాట్లాడుతూ, ఒకప్పుడు అడవుల్లో కిన్నెర వాయించుకునే తనకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రేమతోనే గుర్తింపు దక్కిందని తెలిపారు. కేసీఆర్ గుర్తించడం వలనే తన కళ ప్రపంచం దృష్టికి చేరిందని, తదనంతరం పద్మశ్రీ అవార్డు కూడా దక్కిందని పేర్కొన్నారు. కేసీఆర్ తమ కుటుంబం కోసం చేసిన సహాయానికి, తమ కష్టాలన్నీ తీర్చినందుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. తన ఇంటి స్థలం వివాదాన్ని పరిష్కరించి, కోర్టు కేసుల విషయంలో సహాయం చేయాలని మొగులయ్య కేటీఆర్‌ను విజ్ఞప్తి చేశారు.



## ‘మేమెంతో- మాకంత వాటా దక్కాలి’

రామగిరి, అక్టోబర్ 18 : బీసీ బంద్‌కు నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల అధ్యాపక బృందం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శనివారం కళాశాల ప్రధాన ద్వారం వద్ద అధ్యాపకులంతా బీసీ రిజర్వేషన్ల పెంపు ఆవశ్యకతను తెలియపరుస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ‘‘రాజ్యాధికారంలో మేమెంతో? మాకంత వాటా దక్కాలి” అనే నినాదాలను మిన్నంటిచారు. బీసీ జనాభా దామాషాకు అనుగుణంగా వారికి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడం సామాజిక న్యాయానికి మూలస్తంభమని స్పష్టం చేశారు. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాధికారంలోనూ, స్థానిక సంస్థలలోనూ కనీసం 42% రిజర్వేషన్లు కల్పించడం అత్యంత సమంజసమైన, న్యాయమైన చర్య అన్నారు. చారిత్రక, సామాజిక, ఆర్థిక వివక్షకు గురైన బీసీ వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలంటే, రిజర్వేషన్ల పెంపు తప్పనిసరి అన్నారు.50 శాతం సీలింగ్ అంశాన్ని ప్రత్యేక సందర్భాల్లో పరిగణనలోకి తీసుకుని, బీసీల రిజర్వేషన్ బిల్లులకు వెంటనే కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల సాధన కోసం జరుగుతున్న ఈ ఉద్యమానికి విద్యావేత్తలుగా, అధ్యాపకులుగా తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన వర్గాల హక్కుల కోసం జరుగుతున్న ఈ పోరాటానికి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని నాగార్జున ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డా.పి.రవికుమార్, డా.అంతటి శ్రీనివాస్, అధ్యాపకులు డా.మునిస్వామి, డా.వెల్దండి శ్రీధర్, డా.అనిల్ అబ్రహం, డా.ఆదె మల్లేశం, సుధాకర్, కాంట్రాక్ట్ అధ్యాపకులు, అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.నల్లగొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో బీసీ బంద్ శాంతియుతంగా కొనసాగింది. బంద్‌లో విద్యార్థి సంఘ నాయకులు, ఆర్ట్స్, సైన్స్, కామర్స్, బీటెక్ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ బీఆర్ఎస్వీ నాయకుడు వాడపల్లి నవీన్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మా హక్కులు దక్కే వరకు మా పోరాటం ఆగదు అని విద్యార్థి సంఘాలు ఈ సందర్భంగా ప్రకటించాయి.




## చట్టబద్ధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి : చండూరు అఖిలపక్షం

చండూరు, అక్టోబర్ 18 : కేంద్ర ప్రభుత్వం వెంటనే 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని చండూరు అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ జేఏసీ పిలుపు మేరకు శనివారం చండూరు మండల కేంద్రంలో చేపట్టిన బంద్ విజయవంతం అయింది. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, సీపీఎం, బీసీ అఖిలపక్ష నాయకులు, కార్యకర్తలందరూ కలిసి బీసీ రిజర్వేషన్ బిల్లును వెంటనే ఆమోదించాలని నిరసన తెలియజేస్తూ రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. మండలంలోని వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు, కళాశాలలు బంద్‌కు సంఘీభావంగా స్వచ్ఛందంగా మూతపడ్డాయి.ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ ఏ ఒక్కరు బీసీ రిజర్వేషన్లపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఎస్సీలు, బీసీలు రాజకీయంగా ఎదగాలంటే జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు . కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చండూరు మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, బీఆర్ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న, కొత్తపాటి సతీశ్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కొరివి ఓంకారం, అనంత చంద్రశేఖర్, బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులు ముదిగొండ ఆంజనేయులు, పందుల సత్యం గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీశ్, సీపీఎం మండలాధ్యక్షుడు జేరిపోతుల ధనంజయ్ గౌడ్, బహుజన్ సమాజ్ వాజ్ పార్టీ మునుగోడు నియోజకవర్గం నాయకుడు కట్ల జగన్నాథం, వివిధ పార్టీలకు చెందిన బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఢిల్లీలో ఎంపీల నివాస సముదాయంలో భారీ అగ్నిప్రమాదం



దేశ రాజధాని ఢిల్లీ లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఎంపీల నివాస సముదాయంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన అగ్నిమాపక దళాలు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి.ఢిల్లీలోని బిషంబర్ దాస్ మార్గ్ లోని బ్రహ్మపుత్ర అపార్ట్‌మెంట్స్ లో శనివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. పార్లమెంట్ సభ్యులకు కేటాయించిన ఫ్లాట్స్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిప్రమాదం గురించి మధ్యాహ్నం 1:20 గంటలకు తమకు సమాచారం అందినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. సమాచారం అందగానే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో మూడో అంతస్తులో ఒకరికి కాలిన గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం

## అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



నార్నూర్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై అనుచిత వాక్యాలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన ( చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మానే సంతోష్ డిమాండ్ చేశారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పని చేస్తున్న ఓం ప్రకాష్ అనే వ్యక్తి బాబాసాహెబ్ ను అవమానపరిచేలా మాట్లాడారని అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల జేఏసీ కో కన్వీనర్ రాందాస్ జాదవ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అరిక్లె దశరథ్, దళిత హక్కుల మండల కో కన్వీనర్ గాయక్వాడ్ విలాస్ పాల్గొన్నారు.

## ‘బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలి’



రామవరం, అక్టోబర్ 18 : దశాబ్దాలుగా బీసీ వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందని, బీసీ జనాభా ఎక్కువ ఉన్న తెలంగాణ రాష్ట్రంలో 5 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఉండడం చాలా అన్యాయం అని కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సకినాల సమ్మయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని సింగరేణి కాలరీస్ బీసీ ఒ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకత్వం పిలుపు మేరకు శనివారం ఉదయం కొత్తగూడెం ఏరియాలో అన్ని మైన్స్, డిపార్ట్‌మెంట్స్ వద్ద అధికారులకు నాయకులు మెమొరాండం సమర్పించారు.ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ.. బీసీలకు విద్యా, ఉద్యోగ నియామకాల్లో సైతం అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణిలో బీసీ, ఓబీసీ ఉద్యోగులకు కూడా ఖీూఖీ పద్ధతిలో అన్యాయం జరుగుతుందని తెలిపారు. కాబట్టి తెలగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు. అనంతరం పీవీకే గని మేనేజర్ శ్యాం ప్రసాద్ కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.వీరభద్రయ్య, బోరింగ్ శంకర్, వల్లాల సాంబమూర్తి, శంకర్, ఎస్.సంపత్, ఈ.శ్రీనివాస్, వై.శంకర్, మహేశ్, ప్రభాకర్, ధర్మ, రాజేశ్, రాజ, బీసీ, ఓబీసీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బంద్

కరీంనగర్,శనివారం వేకువజామున్నే రోడ్లపైకి వచ్చిన బీసీ సంఘాలు, కాంగ్రెస్ వామపక్ష పార్టీల నేతలు బంద్ నిర్వహించారు. బంద్ సందర్భంగా 11 డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు కదలలేదు. బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పలేదు. వేములవాడ లో బైక్ పై తిరుగుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బంద్ ను పర్యవేక్షించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకై బంద్ కు సహకరించాలని వర్తక వ్యాపార సంస్థలను ఆది శ్రీనివాస్ కోరారు. వ్యాపార సంస్థలు, హోటళ్ళు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి.

# మోపిదేవి దారెటు



గుంటూరు, అక్టోబరు 18, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ రాజకీయంగా తన పతనాన్ని తానే కొనితెచ్చుకున్నట్లయింది. గత కొన్ని నెలల నుంచి మోపిదేవి మాట కూడా వినిపించడం లేదు. రాజ్యసభ సభ్యుడిగా ఉండాల్సిన మోపిదేవి వెంకటరమణ రాజీనామా ఇప్పుడు ఖాళీగా గోళ్లు గిల్లుకుంటూనే ఉన్నారు. మహా అయితే.. రానున్న కాలంలో ఎమ్మెల్సీ పదవి దక్కుతుందేమో కానీ.. టీడీపీ ప్రభుత్వంలో మోపిదేవి వెంకటరమణకు మంత్రి పదవి దక్కడం మాత్రం జరిగే పని కాదు. అందులోనూ రేపల్లెలో తన చిరకాల ప్రత్యర్థి అనగాని సత్యప్రసాద్ ఉన్నప్పుడు మోపిదేవిని బొట్టు పెట్టి పిలిచి మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఎంతమాత్రం లేదు. ఇంతోటి దానికి ఎందుకు రాజీనామా చేసి పార్టీ మారారంటూ అనుచరులే ప్రశ్నిస్తున్నారు.. ఇక రేపల్లె నియోజకవర్గంలోనూ వేలు పెట్టే అవకాశం కూడా మోపిదేవి వెంకటరమణకు గాని, ఆయన అనుచరులకు గాని లేదు. అది అనగాని అడ్డా కావడంతో మోపిదేవి నామమాత్రపు నేతగానే మిగిలిపోయారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడిగా ఉన్న మోపిదేవి వెంకటరమణ తన పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభకు రాజీనామా చేసి ఆయన ఎమ్మెల్సీగా ఎన్నిక కావాలని భావించారు. కొన్ని నెలల నుంచి మోపిదేవి వెంకటరమణ పదవి కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకూ ఐదు ఎమ్మెల్సీ పోస్టులు భర్తీ అయినా అందులో మోపిదేవి పేరు కనిపించలేదు. మూడు టీడీపీ, జనసేన, బీజేపీ చెరొక స్థానం తీసుకున్నా మోపిదేవి వెంకటరమణకు మాత్రం ఛాన్స్ రాలేదు. .. రానున్న ఖాళీల తర్వాత ఏదైనా మోపిదేవి వెంకటరమణకు ఛాన్స్ ఉంటే ఉండవచ్చు. కానీ ఎమ్మెల్సీకి మించి మోపిదేవి వెంకటరమణ ఎదగలేరన్నది వాస్తవం. ఎందుకంటే వైసీపీ నుంచి వచ్చిన నేత కావడంతో పాటు జగన్ కు జిగిరీ దోస్త్ కావడంతో చంద్రబాబు నాయుడు అంత తేలికగా మోపిదేవిని నమ్మే అవకాశం లేదు. రాజ్యసభ పదవి త్యాగం చేసినందుకు ఎమ్మెల్సీ పదవి దక్కే అవకాశముంది. అదీ ఒక్క ఛాన్స్ వరకూ మాత్రమే అన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. వైసీపీలో ఉన్న సమయంలో ఓడిపోయినా మంత్రిని చేసి, తర్వాత అనుకోని పరిస్థితుల్లో రాజ్యసభ పదవికి ఎంపిక చేసిన పార్టీని కాదని మోపిదేవి వెంకటరమణ సైకలెక్కి ఇప్పుడు బాధపడితే ప్రయోజనం ఏముంటుంది?

## విజయసాయిరెడ్డి యాక్టివ్ పాలిటిక్స్...

నెల్లూరు, అక్టోబరు 18, మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తిరిగి రాజకీయాల్లో యాక్టివ్ అయ్యేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం జరుగుతుంది. రాజకీయాలకు సన్యాసం చెప్పి తాను వ్యవసాయం చూసుకుంటానని చెప్పిన విజయసాయిరెడ్డికి తిరిగి పాలిటిక్స్ పై మోజు పెరిగిందంటున్నారు. ఆయన తన అత్యంత సన్నిహితుడితో కలసి మాట్లాడినప్పుడు ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిసింది. అయితే వైసీపీకి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి బీజేపీలో చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న ప్రచారం జరిగింది. కానీ సాయిరెడ్డి ఇప్పటి వరకూ ఆ పార్టీలో చేరలేదు. బీజేపీ అయినా ఆయనను కాదనుకుని ఉండాలి. లేకుంటే అది ప్రచారానికే పరిమితమయి ఉండాలి. కానీ విజయసాయిరెడ్డి ఇప్పుడు ఏ పార్టీలో చేరతారన్నది ఆసక్తికరంగా మారింది. వైసీపీలో చేరే అవకాశాలు ఎంత మాత్రం లేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ మద్యం కేసులో విజయసాయిరెడ్డి ఇచ్చిన లీకులు కావచ్చు. తర్వాత వైఎస్ షర్మిలతో భేటీ అవ్వడంతో జగన్ పార్టీలోకి రీఎంట్రీ అనేది జరగని పని అని అందరూ అభిప్రాయపడుతున్నారు. అందులో వైఎస్ జగన్ విషయంలో సాయిరెడ్డిని తిరిగి చేర్చుకునేది ఉండకపోవచ్చు. విజయసాయిరెడ్డి చెప్పిన తర్వాత ఏపీ మద్యం కేసులో రాజ్ కేసిరెడ్డి పేరు బయటకు రావడంతో పాటు పలు రకాల ఆరోపణలు చేయడం, జగన్ పై కోటరీ అంటూ విమర్శలు చేయడంతో విజయసాయిరెడ్డిని జగన్ పార్టీలోకి తిరిగి చేర్చుకునే అవకాశాలుండకపోవచ్చు. ఇక విజయసాయిరెడ్డి టీడీపీలో చేరాలనుకున్నప్పటికీ బహుశా చంద్రబాబు నాయుడు అంగీకరించే అవకాశం ఉండకపోవచ్చు. ఎందుకంటే వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్ తో పాటు పార్టీపైన చేసిన విమర్శలను క్యాడర్ ఎవరూ మర్చిపోలేదు. సాయిరెడ్డిని పార్టీలో చేర్చుకుంటే క్యాడర్ నుంచే అసహనం వ్యక్తమయ్యే అవకాశముంది. ఇక ఆయనకు ఏపీలో మిగిలిన పార్టీలు ఒక రెండే రెండు. ఒకటి జనసేన రెండు కాంగ్రెస్. జనసేనలో చేరాలనుకున్నప్పటికీ అది కూడా సాయిరెడ్డికి సాధ్యం కాకపోవచ్చు. చేరినా నామమాత్రపు నేతగానే మిగిలిపోవచ్చు. ఇకపోతే మిగిలింది కాంగ్రెస్ ఒక్కటే. ఏపీలో ఏమీ లేని కాంగ్రెస్ కు వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ గా ఉండటంతో కీలకంగా మారే అవకాశముంటుంది. షర్మిలకు రాజకీయంగా వెన్నుదన్నుగా ఉంటారన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తుంది. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.



# ఫ్యూచర్ లీడర్ లోకేష్ నా...

విజయవాడ, అక్టోబరు 18,చంద్రబాబు తర్వాత ఎవరు.. ఈ ప్రశ్నకు టీడీపీలో అయితే ఆన్సర్ వెంటనే వస్తుంది నారా లోకేష్ అని..! మరి కూటమి ప్రభుత్వంలో ఎవరు..? అది చెప్పడం కొంచం కష్టం.. అయితే ఆ కష్టాన్ని ప్రధాని మోదీ ఈజీ చేస్తున్నారా.. ? నారా లోకేష్‌ను ఫ్యూచర్ లీడర్‌గా రెడీ చేస్తన్నారా..?ఏపీలో ఎన్నికలు కొత్త 'సన్‌రైజ్'ను తీసుకురావచ్చు, కానీ 'సన్ సెట్' కూడా జరుగుతుంది" అని మోదీ చంద్రబాబు, లోకేష్‌లను ఉ ద్దేశించి విమర్శించారు. ఇక్కడ సన్‌సెట్ అంటే నారా లోకేష్ రాజకీయ భవితవ్యం ఆ ఎన్నికలతో ముగిసిపోతుందన్నది మోదీ మాటల అంతరార్థం అదే నరేంద్రమోదీ .. అదే కర్నూలులో ఇప్పుడు ప్రధానిగా అధికారిక హోదాలో నారా లోకేష్ కు ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారు. అవసరానికి మించి ఎలివేషన్ ఇస్తున్నారు. చిన్నబాబుతో ప్రత్యేక సమావేశాలు.. ఆయన్ను ప్రత్యేకంగా పొగడటాలు.. ట్వీట్‌లలో ప్రత్యేక ప్రస్తావనలు..వీటన్నింటి ద్వారా ప్రధాని మోదీ నారా లోకేష్ ఫ్యూచర్ లీడర్ అన్న సంకేతాలు ఇస్తున్నారా..?ప్రస్తుతానికి ఇది అప్రస్తుతమే కానీ? ఓ చర్చ అయితే పార్టీలో నడుస్తుంటుంది కదా.. టీడీపీలో అయితే దీనిపై పెద్దగా ఆలోచించడానికేం ఉండదు.. చంద్రబాబు తర్వాత లోకేషే.. ! అయితే పార్టీలో పొజిషన్ కాకుండా.. ప్రభుత్వంలో పొజిషన్ గురించి మాట్లాడుకున్నప్పుడు దీనికి ఆన్సర్ చెప్పడం అంత సులభం కాదు. పైగా చంద్రబాబు యాక్టివ్‌గా ఉన్నంత కాలం ఆయన నాయకత్వమే ఉండే అవకాశం ఉంటుంది. ఏపీలో బీజేపీ మైనర్ పార్టీ కాబట్టి.. ఈ కూటమిలో కీలకంగా ఉన్న జనసేన, బాగా పాపులారిటీ ఉన్న జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా లోకేష్ కు పోటీదారు అవుతారు. అయితే ఈ డిస్కషన్ రాకుండా చేసేందుకు రెండు పార్టీల నేతలు ఈ చర్చను రానివ్వరు. పైగా పవన్ కల్యాణ్ చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వంలో ఇంకో 15 ఏళ్లు ఉండాలని పలు సందర్భాల్లో చెప్పారు. లోకేష్ కూడా తన రాజకీయ భవితవ్యంపై చర్చ రాకుండా జాగ్రత్త పడతారు.. కూటమి ప్రభుత్వ ప్రమాణ స్వీకారం జరిగిన విషయాన్ని గుర్తుచేసుకుంటే.. అప్పట్లో పవన్ కల్యాణ్‌కు ప్రధాని మోదీ ఇచ్చిన ప్రాధాన్యత తెలుస్తుంది. ప్రమాణ స్వీకార వేదికపై పవన్‌ను ప్రత్యేకంగా పక్కకు పిలవడం? ఆ తర్వాత అమరావతి 2.0 కార్యక్రమంలోనూ పవన్ కు ప్రాధాన్యత ఇవ్వడం? మరో సందర్భంలో ఆయన్ను పెనుగాలిగా అభివర్ణించారు. ఇప్పటికీ పవన్ కల్యాణ్ పట్ల ఆ ప్రత్యేకమైన అభిప్రాయం ఉంది. అయితే ఈ మధ్య కాలంలో లోకేష్ ఢిల్లీ స్థాయిలో రైజ్ అయ్యారు. కూటమిలో కీలకంగా ఉన్నప్పటికీ జాతీయ స్థాయిలో మాత్రం లోకేష్ లో ప్రొఫైల్ మెయింటెయిన్ చేసేవారు. అయితే విశాఖలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం తర్వాత లోకేష్ రేంజ్ పెరిగింది. గిన్నిస్ రికార్డ్ స్థాయిలో దాని నిర్వహణ విషయంలో లోకేష్ చూపిన చొరవను ప్రధాని గుర్తించారు. వేదిక మీదనే ప్రత్యేక స్థానాన్నిచ్చారు. ఆ తర్వాత వచ్చి తనను కలవాలంటూ పిలిచారు. ప్రధాని ఆహ్వానం మేరకు లోకేష్ కుటుంబంతో సహా వెళ్లి మోదీని కలిశారు. ఆయనతో కలిసి దాదాపు గంటన్నర సేపు డిన్నర్ మీటింగ్ చేశారు. అప్పటి నుంచే మోదీతో లోకేష్ అటాచ్‌మెంట్ పెరిగింది. ఆ తర్వాత లోకేష్ ఢిల్లీ వెళ్లడం కూడా పెరిగింది. చాలామంది కేంద్రమంత్రులను తరుచూ కలుస్తున్నారు. గుగూల్ ను విశాఖకు రప్పించడంతో ఆయన ఖ్యాతి అమాంతం పెరిగిపోయింది. ప్రధాని సహకారం లేకుండా ఇది జరిగే



అవకాశం లేదు. యోగాంధ్ర సక్సెస్ గురించి ఆయన కేంద్ర కేబినెట్‌లో మాట్లాడారు. నిన్న కర్నూల్ పర్యటన తర్వాత.. ట్వీట్ చేసిన ప్రధానమంత్రి? ప్రత్యేకంగా లోకేష్‌ను మెన్షన్ చేశారు. దీనిని బట్టే ఆ ట్వీట్‌కు ఉన్న ప్రాధాన్యత తెలుసుకోవచ్చు. ప్రత్యేకంగా చెప్పడానికి లోకేష్ ఏమీ ముఖ్యమంత్రి కాదు కదా? లోకేష్‌కు ఆ స్థాయి ఎలివేషన్ ఇవ్వడానికి ప్రధానికున్న ప్రధానమైన కారణం ఏంటి.ఈ ఎన్నికల్లో అప్రతిహత విజయంతో కూటమి ఏపీలో తిరుగులేని స్థానంలో ఉంది కానీ.. 2019కి ముందు పరిస్థితి వేరు. ప్రధాని హోదాలో నరేంద్ర మోదీతో సహా.. బీజేపీ మొత్తం లోకేష్‌ను కూడా టార్గెట్ చేసింది. అంటే 2019కి ముందు నారా లోకేష్ పై ప్రధాని మోదీకి తీవ్రమైన వ్యతిరేకత భావం ఉంది. వారసత్వంగా వచ్చి ప్రజలపై పెత్తనం చేయాలనుకుంటున్నారని భావనకు వచ్చారు. సమర్థత ఉన్న వారసులను ప్రోత్సహించడానికి మోదీ వెనుకాడరు. కానీ ప్రజలపై బలవంతంగా రుద్దితేనే వ్యతిరేకిస్తున్నారు. లోకేష్ విషయంలో అప్పట్లో ఆయన అదే ఫీల్ అయ్యారని ప్రచారసభల్లోని మాటలను బట్టి అర్థమైపోతుంద ఆ తర్వాత ఐదేళ్లకు పరిస్థితులు మారాయి. 2024లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఈ కూటమి కట్టడంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ చూపారని.. బీజేపీని టీడీపీని కలపడానికి తన వంతు కృషి చేశారని జనసేన నేతలు .. పవన్ కల్యాణ్ కూడా చెబుతుంటారు. దానికి తగ్గట్లుగా ప్రధాని ఆయనకు ప్రాధాన్యం కూడా ఇచ్చారు. "రాష్ట్రవ్యాప్తంగా 'సూపర్ జీఎస్టీ , సూపర్ సేవింగ్స్' ప్రచారాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ గారికి అభినందనలు తెలియజేస్తున్నాను. సృజనాత్మక పోటీల ద్వారా, యువతలో జీఎస్టీ పట్ల అవగాహన పెంచగలిగారు.." అని అభినందించారు. ప్రత్యేకంగా ట్వీట్ కూడా చేశారు. ఇటీవలి కాలంలో ప్రధాని మోదీ .. నారా లోకేష్ పై ప్రత్యేకమైన అభిమానం చూపిస్తున్నారు. వ్యక్తిగత అంశాలపైనా సలహాలు ఇస్తున్నారు. కర్నూలులో హెలికాప్టర్ వద్ద ఆహ్వానం పలికినప్పుడు బాగా బరువు తగ్గావు అని లోకేష్‌ను అభినందించారు. లోకేష్ పై ప్రధాని మోదీ.. కూటమిలో పార్టీ నేత అయినందునే అభిమానం చూపిస్తున్నారని అనుకోలేము. వారసుడు అనే వ్యతిరేకతను మోదీ తుడిచేసుకున్నారని ఆయన సామర్థ్యాన్ని గుర్తించారని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. చంద్రబాబు తర్వాత లోకేష్ నాయకత్వాన్ని అన్ని రకలుగా మోదీ గుర్తిస్తున్నారా అన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. జరుగుతున్న సంఘటనలు దానిని బలపరుస్తున్నాయి కూడా.,!ఇక్కడ ఇంకో విషయం జాగ్రత్తగా చూడాలి. పొత్తులతో పార్టీలను నడుపుతున్నప్పుడు.. మిత్రుల మనోభావాలను పట్టించుకోవాలి. పవన్ కల్యాణ్ నిర్ద్వంధంగా చంద్రబాబు నాయుకత్వాన్ని సమర్థిస్తున్నారు. ఇంకో 15 ఏళ్లైనా ఆయన నేతృత్వంలో పనిచేయడానికి సిద్ధమే అన్నట్లు మాట్లాడుతున్నారు. పవన్ కల్యాణ్ అలా అంటున్నారుని కానీ.. ఆయన పార్టీ క్యాడర్ మాత్రం ఆయన్ను ఎప్పుడు సీఎంగా చూద్దామా అన్న ఆతృతలో ఉంది. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు వారికి నచ్చడం లేదు కూడా .. ఇక్కడ ఇంకో విషయం జాగ్రత్తగా చూస్తే.. పవన్ చంద్రబాబు నాయకత్వాన్ని అన్నారు కానీ.. టీడీపీ నాయుకత్వం అనలేదు. అంటే టీడీపీలో ఎవరైనా అని చెప్పలేదు. అదే సమయంలో లోకేష్‌పైన వ్యతిరేకత కూడా వ్యక్తం చేయలేదు. ఆయునతో చాలా సోదర, సుహృద్భావ రిలేషన్‌ను కొనసాగిస్తున్నారు. అంతేకాదు.. మరికొన్ని మంత్రిత్వ శాఖలను లోకేష్ నిర్వహించగలరు అని చెప్పడం ద్వారా ఆయన కూడా లోకేష్‌కు ఎలివేషన్ ఇస్తున్నట్లే అనుకోవచ్చు. ప్రస్తుతానికి అమరావతి, పోలవరం, విశాఖ ఆర్థిక రాజధాని, రాయలసీమ ఇండస్ట్రియల్ కేపిటల్ అనే స్పష్టమైన ఫోకస్‌తో కూటమి నడుస్తోంది. చంద్రబాబు నాయకత్వం విషయంలో కూటమిలో వాళ్లకు ఇసుమంతైనా వ్యతిరేకత లేదు. కాకపోతే.. ఈ మధ్య జరిగిన కొన్ని సంఘటనలు.. ప్రధాని స్థాయి వాళ్లు స్పందనలు లోకేష్ ప్రాధాన్యతను పెంచాయి. అందుకే ఆయన ఫ్యూచర్ లీడర్ అనే చర్చకు దారితీశాయి.

# డ్రోన్ హబ్ గా కర్నూలు

కర్నూలు, అక్టోబరు 18,కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో 300 ఎకరాల్లో ఈ డ్రోన్ హబ్ ఏర్పాటు కానుంది. ఇక్కడ విమానాశ్రయం, ఫ్లై జోన్ ఉండటం కారణంగానే ప్రభుత్వం ఓర్వకల్లులో ఈ హబ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. అయితే, అందరూ అనుకున్నట్లు ఇది కేవలం డ్రోన్ తయారీ కేంద్రం కాదు. ఇది డ్రోన్‌కు సంబంధించి అన్ని విషయాలకు సమగ్ర కేంద్రంగా నిలవనుంది.ఈ హబ్‌లోనే తయారు చేస్తారు. తయారు చేసిన డ్రోన్లను అన్ని విధాలా పరీక్షించే సదుపాయాలు కల్పిస్తారు. అంతే కాకుండా, వివిధ రకాల సాంకేతికతలను కలబోసి కొత్త తరం డ్రోన్ల తయారీ కోసం పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రాలను ఈ డ్రోన్ హబ్‌లో ఏర్పాటు చేస్తారు. దీంతో పాటు డ్రోన్ల మరమ్మతులు స్టేషన్స్ ఉంటాయి. ఇక డ్రోన్లకు అవసరమైన సర్టిఫికేషన్ (ధృవీకరణ) వంటి సదుపాయాలన్నీ ఇక్కడ లభిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఎండ్ టు ఎండ్ సొల్యూషన్స్ అందించడమే ఈ డ్రోన్ హబ్ ముఖ్య లక్ష్యం.కర్నూలులోని ఓర్వకల్లులో ఏర్పాటు చేసే డ్రోన్ హబ్‌కు ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే, ప్రపంచంలోనే అతిపెద్ద కామన్ డ్రోన్ టెస్టింగ్ ఫెసిలిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇది తయారయిన డ్రోన్ల నాణ్యతకు హామీకి, సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుంది.ఇక్కడ డ్రోన్లను తయారు చేయడమే కాదు. వీటిని ఆపరేట్ చేసే డ్రోన్ పైలట్‌లు, టెక్నీషియన్లు, ఇంజనీర్లను తయారు చేయడానికి శిక్షణా అకాడమీలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలు నెలకొల్పుతారు. దీని ద్వారా పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.ఓర్వకల్లు ప్రాంతం కర్నూలు విమానాశ్రయం, జాతీయ రహదారులకు అనుకూలంగా ఉండటమే కాకుండా, హైదరాబాద్–బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు దగ్గరగా ఉండటం వల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా అనుకూలంగా ఉంటుంది. డ్రోన్ హబ్ ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోనున్నాయి.కర్నూలులో ఈ డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఈ రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలవుతుంది. అయితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన డ్రోన్ పాలసీ ద్వారా సుమారు వేయి కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రానున్న ఐదేళ్లలో దాదాపు 3 వేల కోట్ల రాబడి వస్తుందని అంచనా. అయితే, ఈ డ్రోన్ సిటీలో ఇప్పటికే డ్రోన్ రంగంలో మంచి పేరున్న సంస్థ గరుడ ఏరోస్పేస్ వంద కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. డ్రోన్ల తయారీ, మరమ్మతులకు సంబంధించిన డ్రోన్–యాజ్–ఎ–సర్వీస్ అందించే అనేక దేశీయ, విదేశీ కంపెనీలను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. దీంతో అనేక దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తమ పెట్టుబడులను ఈ డ్రోన్ సిటీలో పెట్టేందుకు చర్చలు ప్రారంభించాయి. పెరగనున్న ఉ పాధి అవకాశాలుడ్రోన్ హబ్ ద్వారా భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగానూ 40 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించవచ్చని అంచనా వేస్తున్నారు. అంతే కాకుండా, ఇక్కడ ఏర్పాటు చేసే నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా 25 వేల మందికి డ్రోన్ పైలట్‌లుగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పెద్ద ఎత్తున యువతకు ఉపాధి లభిస్తుందని ఈ రంగంలోని నిపుణులు చెబుతున్నారు.

# మధ్యవర్తులను సంప్రదించకండి

తిరుమల ,శ్రీవారి భక్తులకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు విజ్ఞప్తి చేసారు. భక్తులు టీటీడీ వెబ్సైట్లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలి.. దర్శనం లేదా వసతి కోసం ఏ మధ్యవర్తులను సంప్రదించవద్దు. భక్తులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.. భక్తులను మోసం చేస్తున్న దళారీలపై చర్యలు తీసుకోవడానికి టీటీడీ ప్రత్యేక డ్రైవ్ను కూడా ప్రారంభించింది. తిరుమలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచడానికి మనమంతా కలిసి కృషిచేద్దామని అన్నారు. మరోవైపు, ఒక దళారీ తెలంగాణ భక్తులను మోసం చేసిన ఉదంతం బయటపడింది. ఆశోక్ అనే దళారీ శ్రీవారి సేవా టికెట్లు ఇప్పిస్తానని భక్తుల నుంచి రూ.4 లక్షలు వసూలు చేసాడు. డబ్బులు ఆన్లైన్ ద్వారా వేయించుకున్న అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేసాడు. దళారీ అశోక్ ఫోన్ పనిచేయకపోవడంతో విజిలెన్స్ అధికారులకు భక్తుడు ఫిర్యాదు చేసాడు. భక్తుడి ఫిర్యాదు మేరకు తిరుమల పోలీసులు కేసు నమోదు చేసారు.

# వైజాగ్ లో రహేజ పెట్టుబడులు

విశాఖపట్టణం, అక్టోబరు 18, విశాఖలో ఇదివరకే గూగుల్, టీసీఎస్ డేటా సెంటర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాయి. పలు కొత్త సంస్థలు, ఐటీ కంపెనీలు నగరానికి వస్తే త్వరలోనే విశాఖ రూపురేఖలో మారనున్నాయి. ఈ క్రమంలో ప్రముఖ నిర్మాణ సంస్థ కె.రహేజా కార్పొరేషన్ విశాఖలో ఇన్వెస్ట్ చేయడానికి నిర్ణయం తీసుకుంది. విశాఖలో త్వరలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్లు, ఐటీ సంస్థలకు అవసరమైన వాణిజ్య, నివాస భవనాల సముదాయాలు నిర్మించేందుకు రహేజా సంస్థ పెట్టుబడులు పెట్టనుంది. దీని ద్వారా దాదాపు 28.65 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి వస్తుందిఈ ప్రాజెక్టు విశాఖలో ఐటీ రంగం అభివృద్ధికి, ఉత్పాదకత పెరుగుదలకు, అలాగే ఉద్యోగ అవకాశాలు సృష్టించడానికి వీలుంటుంది. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ రూ.2,172.26 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. మధురవాడ ఐటీ హిల్ నంబరు-3లో 27.10 ఎకరాలు భూమిని ప్రాజెక్టు కోసం కేటాయించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 9,681 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని రహేజా సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనలో పేర్కొంది.విశాఖలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఇటీవల ఢిల్లీలో సంస్థ ప్రతినిధులతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. గూగుల్ సంస్థ ఏపీలో ఏకంగా 1.33 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ప్రాజెక్టు ప్రారంభంతో పలు ఐటీ, దాని అనుబంధ సంస్థలు నగరానికి రాబోతున్నాయి. ఈ సంస్థల ఏర్పాటుకు ఆఫీసు స్థలాలు కావాలి. ప్రస్తుతం మిలీనియం టవర్ 1, 2లో సుమారు 6 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలం టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలకు కేటాయించారు. విశాఖకు కొత్తగా రాబోతున్న కంపెనీలకు కార్యాలయ స్థలాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రహేజా సంస్థ చేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 28.65 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఆఫీసు కార్యాలయాల కోసం అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టు విశాఖలో ఐటీ రంగం అభివృద్ధికి, ఉత్పాదకత పెరుగుదలకు, అలాగే భారీ ఉద్యోగ అవకాశాలు సృష్టించడానికి దోహదపడనుంది.మొదటి దశలో 2028 నాటికి వాణిజ్య భవనాలను, నివాస సముదాయాలను 2030 నాటికి పూర్తి చేయాలని రహేజా సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టు పనుల కోసం రూ.663.42 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఫస్ట్ ఫేజ్ ప్రాజెక్టు పనులతో 9.59 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి రానుందిరెండో దశలో 2031 నాటికి వాణిజ్య భవనాలను, 2035 నాటికి నివాస సముదాయాలను పూర్తిచేసేందుకు రహేజా సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. రెండో దశలో రూ.1,418.84 కోట్లు వెచ్చించనుంది. తద్వారా 19.06 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి తెస్తామని సంస్థ ఏపీ ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనల్లో పేర్కొంది.

## ఆత్మకూరులో ఆనం రామనారాయణ రెడ్డి పర్యటన

ఆత్మకూరు,స్వర్ణాంధ్ర...స్వచ్ఛ ఆంధ్ర ... కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు ఆంజనేయ స్వామి గుడి సమీపంలోని మున్సిపల్ డంపింగ్ యార్డ్ ను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం పరిశీలించారు. ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర.. ఈవారం క్లీన్ ఎయిర్ (స్వచ్ఛమైన గాలి) థీమ్ తో కార్యక్రమాలు జరుగుతున్నాయి. మంత్రి మాట్లాడుతూ చెత్తరహిత ఆత్మకూరు సాధనే లక్ష్యం. ప్లాస్టిక్ నిషేధం, కాలుష్య నివారణ, పరిసరాల పరిశుభ్రతతోనే ఆహ్లాదకరమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలి లభ్యం అని అన్నారు

# వైయస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శిగా దేశం సుధాకర్ రెడ్డి కి అభినందనల వెల్లువ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 18-? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైయస్సార్సీపీ) రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన దేశం సుధాకర్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో పార్టీలో కీలక పదవిని చేపట్టిన సందర్భంగా, నంద్యాల జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు ఆయనను ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.?వైయస్సార్సీపీ నంద్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ ఎం. సోమశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి యువ నాయకుడు, కౌన్సిలర్ ఎన్. చంద్రశేఖర్ రెడ్డి శనివారం దేశం సుధాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.?ఈ సందర్భంగా ఎం. సోమశేఖర్ రెడ్డి, ఎన్. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... దేశం సుధాకర్ రెడ్డి గారి అనుభవం, నిబద్ధత పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వంలో వైయస్సార్సీపీ తిరిగి ప్రజలకు మరింతగా చేరువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు సుధాకర్ రెడ్డి గారిపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా ఆయన రాష్ట్ర కార్యదర్శిగా అద్భుతమైన సేవలు అందిస్తారని పేర్కొన్నారు.??నంద్యాల జిల్లాలో పార్టీ బలోపేతానికి, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గారి ఆశయాల సాధనకు కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. తమ అభినందనలు స్వీకరించిన దేశం సుధాకర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డికి, చంద్రశేఖర్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. జగన్ మోహన్ రెడ్డి గారి నాయకత్వాన్ని బలపరుస్తూ, రాష్ట్రంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పార్టీకి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు నేతలు తెలిపారు.

# స్వచ్ఛ మైన గాలి ఆరోగ్య మైన జీవనమే నినాదం మంత్రి ఎన్ఎండి ఫరూక్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 18-'స్వచ్ఛమైన గాలి ? ఆరోగ్యమైన జీవనం' నినాదంతో నంద్యాల పురపాలక సంఘం ఆధ్వర్యంలో నందమూరి నగర్ 37వ వార్డులో "స్వర్ణ ఆంధ్ర ? స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ, "క్లీన్ ఎయిర్ ఏపీ ? గ్రీన్ ఏపీ" లక్ష్యంగా ప్రజల్లో వాయు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పట్టణంలో పచ్చదనాన్ని పెంచే దిశగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. "స్వచ్ఛ గాలి ఆరోగ్యానికి వరం" అనే సందేశాన్ని ప్రతి ఇంటికీ చేర్చాలని పిలుపునిచ్చారు.తరువాత మంత్రి ఫరూక్ నాయకత్వంలో పాల్గొన్న వారంతా 'స్వచ్ఛ ఆంధ్ర' ప్రతిజ్ఞ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని అందరూ సంకల్పబద్ధంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో 38వ వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గ రాముడు, 37వ వార్డు బూత్ ఇన్చార్జిలు నారాయణ, చందు, ఖలీల్, షబ్బీర్, క్లస్టర్ ఇంచార్జ్ గోవింద నాయుడు, కామిని మల్లికార్జున, దేరెడ్డి శివనాగిరెడ్డి. మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎంఈ గుర్రప్ప, పిడి వెంకటదాసు, సీఎంఎం శోభారాణి. కౌన్సిలర్ కండే శ్యామ్ సుందర్ లాల్, డైరెక్టర్ మునియర్ ఖలీల్, షేక్ మున్న, నాగేశ్వరరావు, నందం బాబురావు, ఖాజా శంకర్, సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

# మెప్మాపై ఉక్కుపాదం మోపాలి

## కార్యాలయంలోనే కొట్టుకున్న అవినీతి ఉద్యోగులు సీఓలు, ఆర్పీలు సహా నలుగురిపై సస్పెన్షన్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 18-?నంద్యాల జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పేరుకుపోయిన అవినీతిపై మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. గురువారం నూతన పీడీ (ప్రాజెక్ట్ డైరెక్టర్)గా బాధ్యతలు స్వీకరించిన వెంకట దాస్‌ను కలిసి, కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని గట్టిగా కోరుతున్నారు .?నంద్యాల మెప్మా కార్యాలయంలో పరిస్థితి ఎంత దిగజారిందో చెప్పడానికి ఇటీవల జరిగిన ఘటనే నిదర్శనం. అవినీతి ఆరోపణలకు సంబంధించి ఏకంగా మెప్మా కార్యాలయంలోనే సీఓలు (కమ్యూనిటీ ఆర్గనైజర్లు) మరియు సీఆర్పీలు (కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్) కొట్టుకున్నారన్న వార్త జిల్లా వ్యాప్తంగా బలంగా వినిపిస్తోంది. పేదరిక నిర్మూలన లక్ష్యంగా పనిచేయాల్సిన ఉద్యోగులు, ఇలా వ్యక్తిగత కక్షలు, అక్రమాల విషయంలో గొడవపడడంపై మహిళా సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి.?సమాచారం అందుకున్న వెంటనే, విజయవాడ నుండి వచ్చిన ఉన్నతాధికారులు ఈ ఘటనపై లోతైన విచారణ జరిపారు. అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో, ఇద్దరు సీఓలు ? లక్ష్మి కుమారి మరియు దూదేకుల ఉశేన్ బీ ? లను అలాగే ఇద్దరు ఆర్పీలు ? భవానీ, రహిమత్‌లను ? తక్షణమే సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.?"అవినీతి ఉద్యోగుల మధ్య గొడవలు, సస్పెన్షన్లతో మెప్మా పరువు బజారున పడింది. పేద మహిళల కష్టార్జితాన్ని, వారికి అందాల్సిన ప్రభుత్వ సాయాన్ని మధ్యలో దోచుకుంటున్న ఈ వ్యవస్థను సమూలంగా మార్చాలి" అని మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.?తాజాగా బాధ్యతలు చేపట్టిన నూతన పీడీ వెంకట దాస్‌కు ఇది తొలి, అతిపెద్ద సవాలుగా మారింది. సస్పెన్షన్లతో సరిపెట్టకుండా, కార్యాలయంలోని అవినీతికి మూల కారణాలను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిపై ఉక్కుపాదం మోపాలని పలు మహిళా సంఘాలు ఆయన్ను కలిసి విజ్ఞప్తి చేశాయి. పేద మహిళల సంక్షేమం కోసం ఆయన ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకుంటారో జిల్లా ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# శ్రమదానం పారిశుద్ధ్యమే పరమావధి

## ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాలతో... జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో 'స్వచ్ఛ దివస్' ఘనంగా నిర్వహణ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 18-?ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ్ ఆంధ్ర- స్వచ్ఛ్ దివస్" కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా పోలీసులు శనివారం (ప్రతి మూడో శనివారం) విజయవంతంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ ఆఫీసులు, ఎస్.డి.పి.ఓ. కార్యాలయాలు, అలాగే జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని అన్ని విభాగాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు.?పరిశుభ్రతకు పదును:?జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) పరిసరాలలో, మోటార్ వెహికల్ విభాగం, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కార్యాలయాలు, ఆయుధ విభాగం, కాన్ఫరెన్స్ హాల్, డీసీఆర్బీ, స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్ట్ కార్యాలయం, సైబర్ క్రైమ్ కార్యాలయం సహా అన్ని విభాగాల సిబ్బంది ఈ స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది స్వయంగా పారలు, గుణపాలు చేతబట్టి కార్యాలయాల చుట్టూ పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించారు. చిన్న చిన్న గుంతలను పూడ్చివేసి, పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.?మన ఆఫీసు - మన ఇల్లు:?ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మన ఇల్లు లాగే మన కార్యాలయాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్" కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పరిశుభ్రత పట్ల అవగాహన పెరుగుతుందని, ఇది ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛ రాష్ట్రంగా మార్చడంలో సహాయపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. నేటి నుండి తాము, తోటి వారికి స్వచ్ఛతపై అవగాహన కల్పించడానికి తమ వంతు కృషి చేస్తామని సిబ్బంది ప్రతినబూనారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ విభాగంలో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడుతోందని స్పష్టమైంది.

# ఆటోలో మరిచిపోయిన రూ. 5 లక్షల బంగారు నగలు రికవరీ

## గంటల్లోనే 9 తులాల బంగారు బ్యాగును కనిపెట్టిన నంద్యాల వన్ టౌన్ పోలీసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 18-?నంద్యాల వన్ టౌన్ పోలీసులు తమ అసాధారణ వేగంతో మరోసారి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. కేవలం గంటన్నర వ్యవధిలోనే ఆటోలో మరిచిపోయిన సుమారు 9 తులాల (దాదాపు రూ. 5 లక్షలు విలువ చేసే) బంగారు నగలున్న హ్యాండ్‌బ్యాగును కనిపెట్టి, అసలు యజమానికి అప్పగించారు. పోలీసుల సత్వర స్పందనపై ఉన్నతాధికారులు అభినందించారు.?నగల వివరాలు:?నంద్యాల టౌన్, నడిగడ్డకు చెందిన షేక్ రహిమాన్ (30) తన కుటుంబంతో కలిసి అక్టోబర్ 17వ తేదీ సాయంత్రం 6.30 గంటల సమయంలో నడిగడ్డ నుంచి ఆర్టీసీ బస్ స్టాండ్ వరకు ఆటోలో ప్రయాణించారు. బస్ స్టాండ్ వద్ద దిగిన తర్వాత, భార్యకు చెందిన హ్యాండ్‌బ్యాగును ఆటోలో మరిచిపోయినట్లు గుర్తించారు. ఈ బ్యాగులో 8 తులాల బంగారు నెక్లెస్, 1 తులం మాటిలు (మొత్తం 9 తులాల బంగారు నగలు) ఉన్నట్లు రహిమాన్ వెంటనే వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.?సీసీ కెమెరాల ద్వారా ఆటో గుర్తింపు:?ఫిర్యాదు అందిన వెంటనే, నంద్యాల వన్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. సుధాకర్ రెడ్డి నేతృత్వంలోని క్రైమ్ టీమ్ అప్రమత్తమైంది. ఆర్టీసీ బస్ స్టాండ్‌లోని సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. రహిమాన్ ప్రయాణించిన ఆటోను గుర్తించి, అది విశ్వనగర్‌కు చెందిన మాబు హుస్సేన్ ఆటోగా నిర్ధారించారు.?గంటన్నరలో స్వాధీనం:?పోలీసులు వెంటనే ఆటో డ్రైవర్‌ను సంప్రదించి, ఆటోలో ఉన్న బంగారు నగల బ్యాగును రాత్రి 8 గంటల సమయానికే స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఫిర్యాది షేక్ రహిమాన్‌కు అప్పగించారు. పోయిన నగలు తిరిగి రావడంతో రహిమాన్ దంపతులు ఆనందంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.??ఈ కేసును వెంటనే ఛేదించిన హెడ్ కానిస్టేబుళ్లు రమణ, సుబ్బయ్య, కానిస్టేబుళ్ల అమీర్, గురుశేఖర్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.?ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి:?ప్రయాణ సమయంలో తమ విలువైన వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏవైనా అనుమానాస్పద సంఘటనలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం సీఐ సుధాకర్ రెడ్డి ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నంద్యాల అభివృద్ధికి 75 లక్షలతో పనుల ప్రారంభం

## వివిధ ప్రాంతాల్లో భూమి పూజ చేసిన మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 18-నంద్యాల పట్టణాన్ని ఆధునిక రూపంలో తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్.ఎం.డి. ఫరూక్ తెలిపారు. పట్టణంలోని నందమూరి నగర్, వైఎస్ఆర్ నగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో రూ.75 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం మంత్రి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని, నంద్యాల పట్టణంలో రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు.భూమి పూజ చేసిన పనులు:కుందు బ్రిడ్జి నుండి పెట్రోల్ బంక్ వరకు రూ.20 లక్షల వ్యయంతో రోడ్డు ప్యాచ్ వర్క్ ప్రారంభం. ఈ పనులు పూర్తయితే రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. వైఎస్ఆర్ నగర్‌లో రూ.15 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం. వర్షాకాల ఇబ్బందులు తొలగుతాయని అన్నారు.ఆటోనగర్‌లో రూ.40 లక్షలతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు. ఇది రవాణా సౌకర్యం మెరుగుపరుస్తుందని వివరించారు.మొత్తం రూ.75 లక్షలతో చేపట్టిన ఈ పనులు స్థానిక ప్రాంతాల రూపురేఖలను మార్చి, ప్రజల జీవన ప్రమాణాలను పెంచుతాయని మంత్రి ఫరూక్ విశ్వాసం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో 38వ వార్డు టిడిపి ఇన్‌చార్జ్ తాటికొండ బుగ్గ రాముడు, మహేష్, గోవిందు నాయుడు, మరాఠీ సూరి, కామిని మల్లికార్జున, షేక్ మున్న, నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎంఈ గుర్రప్ప, పిడి వెంకట దాస్, కౌన్సిలర్ కండే శ్యామ్ సుందర్ లాల్, దేరెడ్డి శివనాగిరెడ్డి. లీగల్ సెల్ మాజీ అధ్యక్షులు నందం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కార్యాలయంలో సోలార్ పై అవగాహన సదస్సు...

విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:-అక్టోబర్ 18 పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజనల్ ఆఫీసు నందు అధికారులు మరియు సోలార్ ప్రతినిధులతో డోన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కమలాకర్ రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. కమలాకర్ రావు మాట్లాడుతూ విద్యుత్ అధికారులు మరియు సోలార్ ప్రతినిధులు సోలార్ గురించి అవగాహన కల్పించాలని దాని ఉపయోగాలు తెలియజేయాలని కోరారు అలాగే ఎవరైనా 10 ఎకరాలు ఖాళీ స్థలం అద్దెకిచ్చినచో సోలార్ ప్లాంట్ కు నిర్మిస్తామని చెప్పారు. ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డిఇఇ నాగేంద్ర,రూరల్ ఏఈ నాగేశ్వర రెడ్డి, ఫోర్ మెన్ వెంకటేశ్వర్లు, నాయక్ మరియు విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.



# దీపావళి సందడి ప్రారంభం

## టపాకాయల వ్యాపారులకు దుకాణాల కేటాయింపు నంద్యాల తాసిల్దార్ శ్రీనివాసులు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 18-దీపావళి పండుగ వాతావరణం ఊపందుకుంటుండగా టపాకాయల వ్యాపారులకు దుకాణాల కేటాయింపు కార్యక్రమం శనివారం సజావుగా జరిగింది. నంద్యాల తహశీల్దార్ కార్యాలయంలో డ్రా విధానంలో మొత్తం 63 మందికి టపాకాయల దుకాణాలు కేటాయించారని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహశీల్దార్ పత్తి శ్రీనివాసులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని చెల్లింపులు, అనుమతులు పూర్తిచేసుకున్న వ్యాపారులకు మాత్రమే దుకాణాలు కేటాయించామని తెలిపారు. పౌరుల భద్రత దృష్ట్యా వ్యాపారులు సూచనలు, నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఎస్పీజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన టపాకాయల మార్కెట్‌లో 63 దుకాణాలు కేటాయించబడ్డాయి. ప్రజలు టపాకాయలు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరించారు. వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్క్ చేయకూడదని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు.అంతేకాకుండా, టపాకాయల కొనుగోలు కేంద్రాలకు చిన్న పిల్లలను తీసుకురావద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజల సురక్షిత దీపావళి కోసం అధికారులు, వ్యాపారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**